SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 | సంచిక : 224 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 23 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపు

- భూభారతి, గృహ నిర్మాణంపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి
- మంత్రి పొంగులేటి ఆదేశం
- ఎల్ఆర్ఎస్ గడువు పెంచేది లేదని స్పష్టీకరణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

2లో





# పర్యాటకులపై పంజా

- చనిపోయిన వారిలో హైదరాబాద్ వాసి, కర్ణాటక వ్యాపారి..
- క్షతగాత్రుల్లో మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వాసులు
- సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరిపిన దుండగులు
- పహల్గాం పట్టణానికి 6 కి.మీ. దూరంలో దారుణం
- రక్తసిక్తమైన మినీ స్విట్జర్లాండ్
- ఇది అత్యంత ఘాతుకం...
- తీవ్రంగా ఖండించిన ముర్ము, మోదీ, ట్రంప్, పుతిన్ సహ పలువురు నేతలు

2లో

## జపాన్ పెట్టుబడులు.. రూ.12,062 కోట్లు!

- రాష్ట్రంలో దాదాపు 30 వేల ఉద్యోగావకాశాలు
- పలు దిగ్గజ కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు
- హిరోషిమా ఉపగవర్నర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి బృందం భేటీ
- ఏడు రోజుల పర్యటన ముగించుకొని నేడు రాష్ట్రానికి..

2లో



## సివిల్స్ తొలి 100 ర్యాంకర్లలో ఐదుగురు మనవాళ్లు

- వరంగల్‌కు చెందిన సాయిశివానికి 11వ స్థానం
- ఏపీ అభ్యర్థి బన్నా వెంకటేశ్‌కు 15..
- యూపీకి చెందిన శక్తి దుబెకు తొలి ర్యాంకు

**సమయం న్యూస్, ఢిల్లీ, హైదరాబాద్, అమరావతి:** యూపీఎస్సీ.. మంగళవారం విడుదల చేసిన సివిల్స్2024 తుది ఫలితాల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని నైనికి చెందిన శక్తి దుబె తొలి స్థానంలో నిలిచారు. వరంగల్‌కు చెందిన సాయిశివాని 11వ ర్యాంకు సాధించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆమెదే ఉత్తమ ర్యాంకు. ఆ తర్వాత ర్యాంకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన బన్నా వెంకటేశ్‌ది. ఆయన ఇప్పటికే సివిల్ సర్వీసెస్‌లో ఉన్నా... మళ్లీ రాసి 15వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. సివిల్ సర్వీసెస్‌లో 100లోపు ర్యాంకుల్లో ఐదు సాధించి మరోసారి తెలుగు రాష్ట్రాల అభ్యరులు సత్తా చాటారు. 50 మందికిపైగా తెలుగు అభ్యర్థులు వివిధ కేంద్ర సర్వీసులకు ఎంపికయ్యారు. తెలుగు విజేతల్లో అమ్మాయిలు 10 మందిలోపే ఉండటం గమనార్హం. ఈసారి 1 నుంచి

తరువాయి 2లో



సాయిశివాని



బన్నా వెంకటేశ్



శక్తి దుబె



## సుంకాలేతర అడ్డంకులను తొలగించండి

- భారత్‌కు జేడీ వాన్స్ పిలుపు

**సమయం న్యూస్, అమరావతి:** జైపూర్: రెండు దేశాల మధ్య సులభతర వాణిజ్యం కోసం సుంకాలేతర అడ్డంకులను తొలగించాలని, తమ దేశం నుంచి ఇంధన, సైనిక సామగ్రిని కొనుగోలు చేసేందుకు వీలుగా మార్కెట్లను మరింతగా తెరవాలని భారత్‌కు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పిలుపునిచ్చారు. ప్రపంచ సవాళ్లను రెండు దేశాలూ కలిసి ఎదుర్కోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. భారత్, అమెరికాల బలమైన బంధమే 21వ శతాబ్దపు భవిష్యత్తును నిర్వచిస్తుందని నమ్ముతున్నానని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రత్యేక వ్యక్తి అంటూ వాన్స్ ప్రశంసల జల్లు కురిపించారు. రాజస్థాన్

తరువాయి 2లో

# ఇంటర్‌లో 71.37% మంది పాస్

### తొలిసారిగా 70 శాతానికి పైగా నమోదు

- ఫస్టియర్‌లో 66.89% ఉత్తీర్ణత
- ఫలితాల్లో అమ్మాయిలదే హవా
- 80.12 శాతంతో ములుగు జిల్లా అగ్రస్థానం
- మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల్లో 71.37 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. కరోనా ఏడాది(2021) కాకుండా తొలిసారిగా 70 శాతానికి పైగా ఉత్తీర్ణత నమోదైంది. అలాగే ప్రథమ సంవత్సరంలో 66.89 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 2024తో పోలిస్తే తొలి ఏడాది ఉత్తీర్ణత 5.83 శాతం అధికంగా ఉంది. అబ్బాయిల కంటే అమ్మాయిల ఉత్తీర్ణత 13 నుంచి 14 శాతం అధికంగా ఉండటం గమనార్హం. మంగళవారం ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఉప

తరువాయి 2లో



## ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక చర్చలకు సిద్ధం

* తొలిసారి స్పందించిన పుతిన్

2లో





## హజ్ యాత్రికులకు సదుపాయాలు కల్పించాలి

- 11 వేల మంది హజ్ యాత్రికులు
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు నిబద్ధతతో పనిచేయాలి
- రాష్ట్రస్థాయి సమన్వయ సమావేశం నిర్వహణ
- సమస్యలను నివృత్తికై హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాష

5లో

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు సాయం చేయండి

- కర్నూలులో హైకోర్టు బెంచ్ త్వరగా ఏర్పాటు చేయండి
- పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిలో వేగం పెంచండి
- కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, అర్జున్‌రామ్, పీయూష్ గోయల్‌లకు సీఎం చంద్రబాబు వినతులు
- హోంమంత్రి అమిత్ షాతో రాజకీయ అంశాలపై చర్చ

2లో



# పర్యాటకులపై పంజా

పహల్గాం: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు పేట్రేగిపోయారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేర్కొందిన అనంత్‌నాగ్ జిల్లా పహల్గాం సమీప బైసరన్ లోయలోని పచ్చని మైదానంలో విహరిస్తున్న పర్యాటకులను సాయుధ ముష్కరులు చుట్టుముట్టి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో చోటుచేసుకుంది. దుండగులు అతి సమీపం నుంచి తుపాకులు ఎక్కుపెట్టి తూటాల వర్షం కురిపించారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడి చేశారు. 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. కాల్పుల శబ్దం విని అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టాయి. ప్రధాని మోదీ సూచన మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మంగళవారం రాత్రి శ్రీనగర్‌కు చేరుకున్నారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నిఘా విభాగం అధికారి మనీశ్ రంజన్, కర్ణాటకకు చెందిన వ్యాపారి మంజునాథ్ ప్రాణాలు కోల్పోయారు. పర్వతాల మధ్య ఉండే బైసరన్ ప్రాంతానికి కాలినడక లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉంది. కాల్పుల్లో గాయపడిన వారిలో కొందరిని గుర్రాలపై కిందకు తరలించారు. సహాయక చర్యల కోసం హెలికాప్టర్‌ను రంగంలోకి దించారు.

**ఘాతుకానికి పాల్పడింది ఎవరు?**

కశ్మీర్‌లో కొంతకాలం నుంచి పర్యాటకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో ఉగ్రవాదులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భద్రతా దళాలు భావిస్తున్నాయి. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది గాలిస్తున్నారు.

* **అమర్‌నాథ్ యాత్రను అడ్డుకునే కుట్ర**

అమర్‌నాథ్ యాత్రకు పెద్దఎత్తున రిజిస్ట్రేషన్లు జరిగాయన్న సమాచారం నేపథ్యంలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. 38 రోజులపాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3నుంచి ప్రారంభం కానుంది. దేశం నలుమూలల నుంచి లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో అమర్‌నాథ్ హిమలింగం దర్శనానికి వెళ్తుంటారు. ఈ మార్గాల్లో ఒకటి అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం నుంచి 48 కి.మీ. దూరం ఉండగా, మరొకటి గందర్బల్ జిల్లా బాల్తాల్ నుంచి 14 కి.మీ. దూరం ఉంటుంది.

* **నేడు పహల్గాంకు అమిత్ షా**

సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ ఉగ్రదాడిని ఖండించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఫోన్లో మాట్లాడారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఘటనాస్థలాన్ని సందర్శించాలన్న ప్రధాని ఆదేశంతో హోంమంత్రి అమిత్ షా హుటాహుటిన మంగళవారం రాత్రి శ్రీనగర్‌కు చేరుకున్నారు. భద్రతా సంస్థల ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితులను సమీక్షించారు. ఆయన వెంట జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా కూడా ఉన్నారు. బుధవారం అమిత్ షా పహల్గాంకు వెళ్లనున్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యపై భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ సహా పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాడిని ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది.

* **క్షమించరాని ఘటన: రాష్ట్రపతి ముర్ము**

'పర్యాటకులపై కాల్పులు అత్యంత హేయమైన చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా'.

* **దృఢసంకల్పంతో ఉగ్రనిర్మూలన: ప్రధాని మోదీ**

'అత్యంత హేయమైన దాడికి పాల్పడిన హంతకులు, వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తాం. వారిని వదిలిపెట్టబోం. ఉగ్రమూకల ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదు. ఉగ్రవాదంపై పోరాడాలనే మా సంకల్పం దృఢమైనది. మరింతగా బలపడుతుంది'.

# సుంకాలేతర అడ్డంకులను తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

రాజధాని జైపుర్‌లోని అంతర్జాతీయ కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 'భారత్, అమెరికా విజయవంతంగా కలిసి పని చేస్తే సుసంపన్న, శాంతియుత 21వ శతాబ్దాన్ని చూడగలం. ఒకవేళ అలా చేయడంలో విఫలమైతే అత్యంత దారుణ శతాబ్దాన్ని చూడాల్సి వస్తుంది. భారత్ తన సహజ వాయువు, కీలక ఖనిజాలైన సహజ వనరులను వినియోగించుకోవడానికి మేం సాయం చేస్తాం. కలిసి ఇంధన ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అవాంఛనీయ పోటీని నివారిస్తుంది. అయితే అమెరికాతో ఇంధన బంధాన్ని విస్తృతపరుచుకునే విషయంలో భారత్ సుదూరంగా ఉంది. తన మార్కెట్లను అమెరికాకు అందుబాటులోకి తెచ్చేందుకు భారత్.. సుంకాలేతర అడ్డంకులను తొలగించాలి' అని వాన్స్ పేర్కొన్నారు.

భారత వారసత్వ సంపద, సంప్రదాయాలను చూసి తాను అబ్బురపడినట్లు జేడీ వాన్స్ వెల్లడించారు. మంగళవారం తన సతీమణి ఉషా వాన్స్, పిల్లలు ఇవాన్, వివేక్, మీరాబెల్‌లతో కలిసి ఆయన జైపుర్‌లోని చారిత్రక అంబర్ కోటను సందర్శించారు. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటు చేశారు.

# పోలవరంబనకచర్ల ప్రాజెక్టుకు సాయం చేయండి

దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం దిల్లీలో నలుగురు కీలక కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి చెందిన వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రాజకీయ అంశాలపై వారితో చర్చించారు. విదేశీ పర్యటన ముగించుకొని మంగళవారం తెల్లవారుజామున దిల్లీ చేరుకున్న చంద్రబాబు ఉదయం నుంచి సాయంత్రం వరకు వరుసగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, హోంమంత్రి అమిత్ షాలతో సమావేశమయ్యారు. అమిత్ షాతో భేటీలో రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి వ్యవహారాలతో పాటు రాజకీయ అంశాలూ చర్చకు వచ్చినట్లు తెలిసింది. తొలుత ఉదయం 10.30కి జల్‌శక్తి మంత్రి పాటిల్‌తో జరిగిన భేటీలో రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చేందుకు ప్రతిపాదించిన పోలవరం బనకచర్ల ప్రాజెక్టు గురించి చంద్రబాబు వివరించారు. 'కేంద్రం ప్రతిపాదిస్తున్న నదుల అనుసంధాన లక్ష్యాన్ని ఈ ప్రాజెక్టు నెరవేరుస్తుంది. దీని ద్వారా గోదావరికృష్ణాపెన్నా నదీ పరివాహక ప్రాంతాలను అనుసంధానించి రాష్ట్రంలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చవచ్చు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం తన వంతు సాయం చేయాల'ని విజ్ఞప్తిచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కొళాయి నీరు అందించే జల్‌జీవన్ మిషన్ అమలు కాలాన్ని పొడిగించినందుకు పాటిల్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన లోపాలను సరిదిద్దడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన తాగునీటి వనరులను అనుసంధానించాలని, మిగిలిన గ్రామాలకు కూడా నీరందించేలా ఇప్పుడున్న ధరల ప్రకారం నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో అటల్ భూజల్ యోజన అమలుపైనా చర్చించారు.

**చంద్రబాబు ముందుచూపునకు మేఘ్‌వాల్ కితాబు**

న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ను సీఎం చంద్రబాబు ఆయన నివాసంలో కలిశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దీనిపై ప్రతిపాదనలు పంపినందున కేంద్ర ప్రభుత్వపరంగా అధికారిక కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా మేఘ్‌వాల్ తన మంత్రిత్వశాఖ అధికారులకు చంద్రబాబును పరిచయం చేస్తూ 'ఆయన అన్నింటిలోనూ 25 ఏళ్ల ముందుచూపుతో ఆలోచిస్తారు. ఈనాటి ఆధునిక హైదరాబాద్ ఆయన ఆలోచనా రూపమే'నని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా అర్జున్‌రామ్ దంపతులు చంద్రబాబుకు వినాయకుడి ప్రతిమను బహూకరించారు.

**ఆక్వా రంగాన్ని ఆదుకోండి**

అనంతరం ఇక్కడి వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యాలయం వాణిజ్య భవన్‌లో కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. అమెరికా టారిఫ్ యుద్ధం ప్రకటించాక ఆక్వా రంగంలో నెలకొన్న అనిశ్చితిని వివరించారు. భారత్ నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 26% సుంకాలు విధించడం ఏపీలో మత్స్య రంగానికి తీరని నష్టం చేకూర్చేలా ఉన్నందున కేంద్రం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక చర్యలను ప్రతిపాదించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిపైనా చర్చించారు. వీటికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వినియోగించి త్వరగా మౌలిక వసతుల కల్పనకు ఉపక్రమించాలని కోరారు. ప్రకాశం జిల్లాలో ఉప్పు భూములను రాష్ట్రానికి అప్పగించే అంశం వారి మధ్య చర్చకు వచ్చింది.

# ఇంటర్‌లో 71.37%మంది పాస్



(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఫలితాలను విడుదల చేశారు. మొత్తంగా ఇంటర్ ఫలితాల్లో ములుగు జిల్లా(80.12%) అగ్రస్థానంలో, కామారెడ్డి జిల్లా(54.83%) చివరిస్థానంలో నిలిచాయి. మొదటి ఏడాదిలో మేడ్చల్ జిల్లా (77.59%) మొదటిస్థానం, మెదక్ జిల్లా(46.87%) ఆఖరుస్థానం దక్కించుకున్నాయి. ఇంటర్ జనరల్‌తోపాటు ఒకేషనల్ కోర్సు ఫలితాలను కూడా కలుపుకొంటే మాత్రం మొత్తం ఉత్తీర్ణత 65.65 శాతమే అవుతోంది.

* **భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలి**

ఫలితాల వెల్లడి సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉత్తీర్ణులైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్య వైపు అడుగులు వేసి భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనకు వెళ్లడంతో ఆయన తరఫున అభినందనలు చెప్పేందుకు తాను వచ్చానన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు.

* **నేటినుంచి సప్లిమెంటరీకి దరఖాస్తులు**

ఇంటర్ తప్పిన వారి కోసం మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఈ నెల 23 నుంచి 30 వరకు ఆ పరీక్షలతోపాటు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సప్లిమెంటరీలో పాసైతే రెగ్యులర్‌గా పాసైనట్లే పరిగణిస్తారని, ఒకసారి తప్పిన వారి జాబితాలో ఉండరని చెప్పారు. కార్యక్రమంలో సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే, పరీక్షల కంట్రోలర్ జయప్రద బాయి, సంయుక్త కార్యదర్శులు మోహన్, జ్యోత్స్నరాణి, భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

* **ఫలితాల ముఖ్యాంశాలు ఇవీ..**

రెగ్యులర్, ప్రైవేట్ (ఒకసారి తప్పినవారు), ఒకేషనల్‌తో కలిపి 3,33,908 మంది ఇంటర్‌లో పాసయ్యారు. వారిలో 2.12 లక్షల మంది ఏ గ్రేడ్ (75%, ఆపై మార్కులు) సాధించారు. తొలి ఏడాదిలో 3.22 లక్షల మంది ఉత్తీర్ణులు కాగా వారిలో 2.07 లక్షల మందికి ఏ గ్రేడ్ వచ్చింది.

* **ఫస్టియర్‌లో నలుగురు, సెకండ్ ఇయర్‌లో ఆరుగురి ఫలితాలను విత్ హెల్డ్‌లో ఉంచారు.**

అతితక్కువగా హెచ్‌ఈసీలో 46.26 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అత్యధికంగా ఎంపీసీలో 72.23 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

# జపాన్ పెట్టుబడులు.. రూ.12,062 కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జపాన్‌లో పర్యటించిన తెలంగాణ రైజింగ్ బృందం పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఏడు రోజుల పర్యటనలో రూ.12,062 కోట్ల పెట్టుబడులు సాధించింది. వీటి ద్వారా తెలంగాణలో యువతకు దాదాపు 30,500 ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జపాన్‌కు చెందిన మారుబెని కంపెనీ.. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. రూ.1,000 కోట్లు ప్రారంభ పెట్టుబడి పెట్టనుంది. మొత్తంగా రూ.5,000 కోట్ల పెట్టుబడులకు అంచనా వేసింది. ఎన్‌టీటీ డేటా, నెయిసా సంస్థలతోనూ తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థలు రూ.10,500 కోట్ల పెట్టుబడులతో హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నాయి. తోషిబా ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ)తోనూ ఒప్పందం చేసుకోగా.. ఆ సంస్థ రూ.562 కోట్లతో రుద్రారంలో విద్యుత్ పరికరాలు, సామగ్రి తయారీ ఫ్యాక్టరీని నెలకొల్పనుంది. వీటి ద్వారా 30 వేల ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'టామ్ కామ్'తో టెర్న్, రాజ్ గ్రూప్‌లు చేసుకున్న ఒప్పందాల ఫలితంగా.. తెలంగాణకు చెందిన 500 మందికి జపాన్‌లో ఉద్యోగ నియామకాలకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం ఈ నెల 15న రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరు మీదుగా జపాన్ పర్యటనకు వెళ్లింది. 16న టోక్యో చేరుకుని.. 22 వరకూ పర్యటించింది. ఏడు రోజుల పర్యటనలో జపాన్ పారిశ్రామికవేత్తలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించింది. మురసాకి రివర్ మ్యూజియాన్ని, ఒసాకా రివర్ ఫ్రంట్‌ను సందర్శించింది. మంగళవారం హిరోషిమా ఉపగవర్నర్‌తో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించింది. ముఖ్యమంత్రి బృందం బుధవారం హైదరాబాద్‌కు చేరుకోనుంది. ఈ పర్యటనలో సీఎం వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ కె.రఘువీర్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ సీఈఓ మధుసూదన్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులున్నారు.

# సివిల్స్ తొలి 100 ర్యాంకర్లలో ఐదుగురు మనవాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

200 లోపు ర్యాంకు సాధించిన వారిలో పలువురు గతంలోనూ సివిల్స్‌కు ఎంపికైన వారే. అయితే ఐఏఎస్, ఐపీఎస్ తదితర సర్వీస్‌ల కోసం మరో ప్రయత్నం చేసి పలువురు తమ లక్ష్యాన్ని సాధించుకున్నారు. హరియాణాలో పుట్టి వడోదరలో పెరిగిన హర్షిత గోయల్ రెండో ర్యాంకు, మహారాష్ట్రలోని పుణెకు చెందిన డోంగ్రె అర్చిత్ పరాగ్ మూడో ర్యాంకు సాధించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన షా మార్గి చిరాగ్ నాలుగో ర్యాంకు, దిల్లీకి చెందిన అకాశ్ గర్గ్ ఐదో ర్యాంకు సొంతం చేసుకున్నారు. ఐదుగురు టాపర్లలో ముగ్గురు (1, 2, 4 ర్యాంకులు) మహిళలే కావడం విశేషం. మొత్తంగా దేశంలోని అత్యున్నత సర్వీసులకు 1,009 మంది ఎంపికయ్యారు. వీరిలో 725 మంది పురుషులు, 284 మంది మహిళలు ఉన్నారు. 25 మంది టాపర్లలో 11 మంది మహిళలు, 14 మంది పురుషులు ఉన్నారు కేంద్ర సర్వీసులకు ఎంపికైన వారిలో 335 మంది జనరల్ కేటగిరీకి చెందినవారు. 109 మంది ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, 318 మంది ఓబీసీ వర్గాలకు, 160 మంది ఎస్సీ వర్గాలకు, 87 మంది ఎస్టీ వర్గాలకు చెందినవారు. అన్ని వర్గాల నుంచి 45 మంది దివ్యాంగులు ఎంపికయ్యారు.

# ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక చర్చలకు సిద్ధం

మాస్కో: ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా ఆయన ఇలాంటి ప్రతిపాదన చేయడం గమనార్హం. శాంతిని నెలకొల్పేందుకు అమెరికా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో పుతిన్.. రష్యా దేశ అధికారిక వార్తా ఛానల్‌లో ఈ మేరకు చెప్పారు. ఈ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరోక్షంగా స్పందించారు. పౌరులపై దాడులు ఆపేలా కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఎలాంటి చర్చలకైనా సిద్ధమని చెప్పారు.

**లండన్‌లో చర్చలు..**

యుద్ధానికి ముగింపు పలికేందుకు ఉక్రెయిన్, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా అధికారులు బుధవారం లండన్‌లో చర్చలు జరపనున్నారు. ఈ వ్యవహారంలో ట్రంప్ సర్కారు జోక్యాన్ని కొనసాగించాలా వద్దా అన్నది నిర్ణయించడంలో ఈ భేటీ కీలకం కానుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టంచేశారు. ఒకవైపు శాంతి చర్చలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మరోవైపు రష్యా ఉక్రెయిన్‌లు మాత్రం దాడులను చేసుకుంటూనే ఉన్నాయి. ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన రష్యా, దానిని అమలు చేయలేదు. తాజాగా ఉక్రెయిన్‌లోని ఒడెసా, జపోరిజియా నగరాలపై డ్రోన్లు, గ్లైడ్ బాంబులతో విరుచుకుపడింది. ఇందులో ఒక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోగా.. నలుగురు చిన్నారులు సహా 27 మంది గాయపడ్డారు. యుద్ధం ముగించేందుకు జరిపే శాంతి చర్చలు తక్షణ ఫలితాలను ఇచ్చే అవకాశం లేదని రష్యా అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ప్రకటించారు. పౌర వసతులపై దాడులను ఆపాలన్న జెలెన్‌స్కీ ప్రతిపాదనపై చర్చలకు ప్రణాళికేదీ తమ వద్ద లేదన్నారు.

**వారంలో యుద్ధం ఆగిపోతుంది: ట్రంప్**

మరోవైపు ఉక్రెయిన్, రష్యాల మధ్య ఈ వారంలో శాంతి ఒప్పందం కుదిరి, యుద్ధం ఆగే అవకాశాలున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమం 'ట్రూత్'లో పోస్టు చేశారు.

# ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపు

హైదరాబాద్: ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులైన ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి చట్టం అమలుపై కలెక్టర్లు మరింత శ్రద్ధ పెట్టాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ఆలోచనలు, ప్రాథమ్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారితో కలిసి మంత్రి పొంగులేటి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు అవసరమైన, చిరస్మరణీయమైన భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని.. దాని అమలు బాధ్యత కలెక్టర్లపై ఉందని స్పష్టంచేశారు.

* **28 జిల్లాల్లోని పైలట్ మండలాల్లో కార్యశాలలు**

పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలాల్లో ఈ నెల 30వ తేదీ నాటికి భూభారతి చట్టంపై రెవెన్యూ సదస్సులు పూర్తవుతాయని, ప్రస్తుతం రాష్ట్రంలో 159 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. 'సీసీఎల్‌ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను కూడా పైలట్ మండలాల్లోని రెవెన్యూ సదస్సుల్లో చేర్చాలని అధికారులకు సూచించాం. ఈ మేరకు ప్రస్తుతం 5,905 దరఖాస్తులు వచ్చాయి. వచ్చే నెలలో హైదరాబాద్ సహా 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేస్తాం. ప్రస్తుతం జరుగుతున్న సదస్సుల ద్వారా వచ్చిన విజ్ఞప్తులు, అనుభవంలోకి వచ్చి అంశాల ఆధారంగా తహసీల్దార్ల నేతృత్వంలోని బృందాలు ఆయా మండలాల్లో కార్యశాల(వర్క్‌షాప్)లు నిర్వహించాలి' అని పొంగులేటి మార్గదర్శనం చేశారు.

* **నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ**

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను ప్రతి సోమవారం వారి ఖాతాలలో నేరుగా జమ చేస్తామని మంత్రి తెలిపారు. '400 చ.అడుగులకు తగ్గకుండా, 600 చ.అడుగులకు మించకుండా నిర్మాణం జరిగితేనే అధికారులు బిల్లులు మంజూరు చేయాలి. వానాకాలం నేపథ్యంలో మే నెల మొదటి వారంలోగా నియోజకవర్గానికి 3,500 మంది చొప్పున లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలి. 200 దరఖాస్తులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి, అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలి. అనర్హులకు చోటు కల్పిస్తే ఆ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంటు అందజేసేందుకు ప్రయత్నిస్తున్నాం. పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి త్వరలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలతో చర్చిస్తాం' అని మంత్రి పేర్కొన్నారు.



## కరాటే ఛాంపియన్ ను అభినందించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

అంబర్ పేట, ఏప్రిల్ 22 (సమయం న్యూస్) : గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా గత మాసంలో జరిగిన నాలుగవ కియో జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు మూడు పతకాలు సాధించారు. పారా కరాటే లో సిల్వర్ మెడల్ సాధించిన కాలేరు సాయి ప్రభాస్ ను స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అభినందించారు. ఈరోజు ఎల్బీ స్టేడియంలోని తన ఛాంబర్ లో సాయి ప్రభాస్ ను ఆయన సన్మానించారు.

# ఇంటర్ ఫలితాల్లో...
# విద్యా వికాస్‌లో వికసించిన విద్యా కుసుమాలు

**బోధన్ పట్టణం, 22 ఏప్రిల్, సమయం న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డ్ వారిచే 2025 మార్చ్ లో నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహించగా, ఇంటర్మీడియట్ బోర్డ్ 22 ఏప్రిల్ మంగళవారం రోజున ఫలితాలను విడుదల చేయడం జరిగింది. అందులో భాగంగా బోధన్ పట్టణంలోని విద్యా వికాస్ విద్యా సంస్థల విద్యార్థులు విద్యా కుసుమాలుగా వికసించాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1000 మార్కులకు గాను ఎంపీసీ గ్రూప్ నుండి గోవిందుల గగన్ 993, కోతల్లి హర్షిత 984 బైపిసి గ్రూప్ నుండి సభాహత్ సమీన్ 987, వల్లెపు శృతి 987, సీఈసీ గ్రూప్ నుండి ముత్యాల అరవింద్ 885, ఎంఈసి గ్రూప్ నుండి ఎండి మునిపుద్దిన్ 894 మార్కులను సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ఎంపీసీ గ్రూప్ నుండి 470 మార్కులకు గాను సాగంటి జాన్ వన్య 466 , అంగోత్ వసంత్ 465, మిద్దెల సమన్విత 463, నేనావత్ ప్రతాప్ సింగ్ 462, మైసారి శ్రీకర్ 462, నాగ నిక్షిత్ 461, కడికొల్ల సాత్విక 461, బైపీసీ గ్రూప్ 440 మార్కులకు గాను తహోర తంసిల్ 437, అరిష సమీన్ 432, సిఇసి గ్రూప్ నుండి 500 మార్కులకు గాను లడికే కుశాల్ 477, సి రోహన్ 470 ఎం ఈ సి గ్రూప్ నుండి 500 మార్కులకు గాను ఫైజా నూరిన్ 456, సాధించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల




కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ అనంతలక్ష్మి విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ, ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణంగా ఉందని, విద్యార్థులను అహర్నిశలు ఉత్తమ విద్యార్థులుగా నిలపడానికి మా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అలాగే మాపై నమ్మకం ఉంచి తమ పిల్లలను మా కళాశాలకు పంపిస్తున్న తల్లిదండ్రులకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా మా కళాశాలలు ముందడుగు వేస్తాయని అన్నారు.



## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

* **కొనుగోలు కేంద్రాలలో ఎటువంటి నిర్లక్ష్యం చేయవద్దు**

**వెల్దుర్తి ఏప్రిల్ 22, సమయం న్యూస్:** వెల్దుర్తి మండలం శెట్టిపల్లి కలాను ఐకెపి వరి ధాన్యం కేంద్రాన్ని ఆకస్మికంగా మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ధాన్యం తేమ శాతాన్ని పర్యవేక్షించి, సంబంధిత ధాన్యం కొనుగోల రిజిస్టర్ లను తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రైతులు కళ్లాల్లోని ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈదురు గాలికి ఎగిరిపోకుండా టార్పాలిన్లను పకడ్బందీగా ధాన్యం కుప్పలపై కప్పాలని సూచించారు. అదే విధంగా ఎక్కువ రోజుల వరకు ధాన్యాన్ని కేంద్రాల్లోనే పెట్టుకోకుండా నిర్దిష్ట తేమ శాతం రాగానే కొనుగోళ్లు పూర్తిచేసి, ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశించారు. వీరి వెంట డిఆర్డిఓ శ్రీనివాసరావు, మండల రెవెన్యూ అధికారి కృష్ణ, ఆరెంజ్ నర్సింగ్ యాదవ్, ఏపీఎం శంకరయ్య, సీసీ యాదగిరి, పాల్గొన్నారు.

## ఆత్మీయంగా ఎరాజ్ పల్లి 7వ తరగతి విద్యార్థుల సమ్మేళనం

బోధన్ మండలం, ఏప్రిల్ 22, సమయం న్యూస్ : బోధన్ మండలం ఎరాజ్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1992 93 సంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థినీ విద్యార్థులు వారి క్లాస్ మెంట్ చంద్రకాంత్ రెడ్డి నివాస గృహంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు.చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మరిచిపోలేని సన్నివేశాలను నెమరు వేసుకున్నారు.ఉద్యోగరీత్యా,వివాహాలు చేసుకుని దూర ప్రాంతాలలో సైతం స్థిరపడినప్పటికీ తన చిన్ననాటి తరగతిలో చదువును అభ్యసించిన సన్నివేశాలు,



చిలిపి చేష్టలు చేసుకున్న సందర్భాలను తెలియపరచుకొని సంతోషకరమైన వాతావరణాన్ని నెలకొల్పారు. 33 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత విద్యార్థిని విద్యార్థులు ఒక దగ్గరికి చేరుకొని ఆత్మీయతను పంచుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు.కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎవరు ఏ స్థాయిలో స్థిరపడినప్పటికీ ఒకరికి ఒకరం సోదరా భావంతో ఉంటూ సహాయ సహకారాలు చేసుకుంటూ తోడునీడగా ఉందామన్న సంకల్పం వారి ఆత్మీయతలో కళ్ళకు కట్టింది. వారి చిన్ననాటి జ్ఞాపకాలు అందరినీ మైమరిపించాయి.ఈ కార్యక్రమంలో ఎరాజ్ పల్లి ఏడవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు,వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చిర్యాల్ లో భక్తుల కొంగు బంగారంగా
# విలసిల్లుతున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి

మేడ్చల్ జిల్లా: సప్తదశ 17 వ వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన శ్రీ శ్రీ శ్రీ చీర్యాల లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానం ప్రతి ఏటా జరిగే శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.ఈ సంవత్సరం కూడా శ్రీ శ్రీ శ్రీ చీర్యాల లక్ష్మి నృసింహ స్వామి వారి సప్తదశ (17 వ) వార్షిక బ్రహ్మోత్సవాలు 2025 ఫౌండర్ ఆలయ చైర్మన్ మాలరపు లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

* బ్రహ్మోత్సవాలు 24.4.2025 గురువారం నుండి 27..4 2025 ఆదివారం వరకు జరగనున్నాయి.2442025 గురువారం రోజున సాయంత్రం 5 గంటలకు ఆలయ ఫౌండర్ & చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణ గారి ఇంటి దగ్గర నుండి చీర్యాల గ్రామం లో ఊరేగింపు గా స్వామి వారిని దేవాలయానికి తీసుకొస్తారు.





* 25.04.2025 శుక్రవారం రోజున స్వామివారికి పంచామృత నవ కళాశాభిషేకం ,విశ్వక్సేన పూజ ,పుణ్యావచనం ,రక్షాబంధనం ,అఖండ జ్యోతి స్థాపన ,అంకురార్పణ ,అగ్ని ప్రతిష్ట, సుదర్శన నరసింహయాగం వివిధ పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.
* 26.04.2025 శనివారం రోజున ఉదయం 10 గంటలకు శ్రీ యాదాద్రి ప్రధానార్చకులు నల్లం దిగులు నృసింహ చార్యులు గారి ఆధ్వర్యంలో ఆలయ ఫౌండర్ & చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ గారి చేతుల మీదుగా శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి వారి తిరిగి కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఘనంగా జరగనుంది .
* 27.04.2025 ఆదివారం రోజున మహా పూర్ణాహుతి,శతఘటాభిషేకం, అలంకరణ ,పంచహారతులు చక్రస్నానం తో ఈ యొక్క బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## ఇంటర్మీడియట్ పరీక్షలలో మెరుగైన ఫలితాలు

* **జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె అంజయ్య**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22 సమయం న్యూస్:** ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో జిల్లా మెరుగైన ఫలితాలు సాధించిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో జనరల్ 54.48 శాతంతో 26వ ర్యాంకు, ఒకేషనల్ 61.68 శాతంతో 14వ ర్యాంకు, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 67.85 శాతంతో 21వ ర్యాంకు, ఒకేషనల్ 77.13 శాతంతో 9వ ర్యాంకు సాధించడం జరిగిందని తెలిపారు.



## బోధన్ బస్టాండ్ మరియు ఇతర ప్రదేశాలలో పోలీస్ జాగిలాలతో తనిఖీ

**బోధన్. ఏప్రిల్ 22. సమయం న్యూస్ :** బోధన పట్టణంలో 22వ తారీకు సాయంత్రం నిజామాబాద్ నుంచి వచ్చిన పోలీస్ జాగిలాలతో. బోధన్ సీఐ వెంకట్ నారాయణ ఆధ్వర్యంలో. ఆర్టీసీ బస్ స్టాండు . ఆటో స్టాండ్ లో. శెక్కర్ నగర్ చౌరస్తాలోని పలు హోటలలో. రైల్వే స్టేషన్ మరియు ఇతర ప్రాంతాల్లో పాత బస్టాండ్ తదితర ఏరియాలో పోలీస్ జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ టౌన్ సీఐ వెంకట్ నారాయణ మాట్లాడుతూ ఎప్పుడు నిర్వహించే తనిఖీలలో భాగముగా ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలియపరిచారు.



## ప్రతి రైతుకు భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని వివరించాలి

* **రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22, సమయం న్యూస్:** భూ సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపరిచిన హక్కులు, అంశాలను ప్రతి రైతుకు వివరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, గృహ నిర్మాణశాఖ అధికారులతో భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో పైలెట్ మండలాలలో రెవెన్యూ సదస్సులు, అవగాహన సదస్సుల నిర్వహణ, పైలెట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, మిగతా గ్రామాలలో అర్హుల జాబితా రూపకల్పన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం అమలులో భాగంగా రాష్ట్రంలో మొదటగా నారాయణపేట, ఖమ్మం, కామారెడ్డి, ములుగు జిల్లాలలో జిల్లాకు ఒకటి చొప్పున నాలుగు మండలాలను ఎంపిక చేయడం జరిగిందని, ఆయా మండలాలలోని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అంశాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అందులో ఫపరిష్కరించడానికి వీలు ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇతర జిల్లాలలో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం లోని అంశాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి చట్టంలో పొందుపరిచిన హక్కులు, అంశాలను వివరించాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు అవగాహన సదస్సులు పూర్తి చేయాలని ఆదేశించారు. పైలెట్ గ్రామాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, మిగతా గ్రామాలలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రతిపాదించిన జాబితాను గెజిటెడ్ అధికారులతో మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాలని, జాబితాలో




అర్హుల వివరాలు మాత్రమే ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం లోని హక్కులు, జిల్లాలోని మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించి, ఆ ప్రకారంగా అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు వివరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు చట్టంలోని అంశాలు, హక్కులు వివరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ నెల 30వ తేదీలోగా అవగాహన సదస్సుల ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో పైలెట్ గ్రామాలలో ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అర్హులైన లబ్దిదారులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, మిగతా గ్రామాలలో అర్హులైన వారి జాబితా రూపకల్పనకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, హౌసింగ్ పిడి బన్సీలాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఎన్నాళ్లీ ఉచిత .. భూ పందేరాలు..!

రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న భూ పందేరాలు సామాన్యులకు సంకటంగా మారుతున్నాయి. పేరుకు పరిశ్రమల యాజమాన్యాలకు కట్టబెడుతున్నా.. తదుపరి కాలంలో ఇవి వ్యాపారానికి మార్చుకుంటున్నారు. ప్రజాప్రయోజనాలు పక్కకు పోతున్న తీరును పట్టించుకోవడం లేదు. ఇటీవల హైదరాబాద్ కంచెగచ్చిబౌలి లో 400 ఎకరాల భూ వివాదం ఈ కోవలోనిదే. గతంలో ఈ భూమిని ఓ పారిశ్రామిక వేత్తకు అప్పగించారు. దానిని కోర్టు ద్వారా తిరిగి స్వాధీనం చేసుకున్నారు. కానీ కాంగ్రెస్ ఇక్కడ చిత్తశుద్ధి ప్రదర్శించకుండా మళ్లీ అమ్మకానికి సిద్దపడిరది. ఈ క్రమంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడంతో సమస్య తీవ్రత తెలిసింది. ప్రభుత్వాలు తమ అవసరాలు లేదా ఉచిత పథకాల కోసం ఇష్టారీతిన భూములను కట్టబెడుతున్నారు. ప్రపంచాలు తిరుగుతూ రండి పెట్టుబడి పెట్టండి..భూములు ఇస్తాం..విద్యుత్ ఇస్తాం..నీరు ఇస్తాం అని ప్రాచారాలు సాగిస్తున్నారు. విశాఖలో గత వైకాపా ప్రభుత్వం అనుసరించిన రీతినే తాజాగా టిడిపి ప్రభుత్వం అనుసరిస్తోంది. ఇప్పటికే రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూముల్లో కమర్షియల్ కార్యకాలా పాల కారణంగా 15 ఎకరాల వరకు వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే తాజాగా టిసిఎస్‌కు భూములు కట్టబెట్టడం, అదికూడా అత్యంత చౌకకు అందచేయడం వివాదంగా మారింది. దీనిని విపక్ష వైకాపా కూడా వ్యతిరేకించింది. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా పేరొందిన విశాఖ నగరంలోని రుషికొండ ప్రాంతంలో ఎకరం కేవలం 99 పైసల చొప్పున టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ టిసిఎస్‌కు 21.16 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అప్పనంగా అప్పగించడం దారుణం. 99 పైసలకు ఎకరా ఎలా అప్పగిస్తారన్నదే సమస్య. రుషికొండలో భూమి విలువ రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ రేట్ల ప్రకారం ఒక చదరపు గజం రూ.30 వేలు ప్రాతిపదికగా తీసుకున్నా ఒక ఎకరం సుమారు రూ.15 కోట్లు. అంటే, టిసిఎస్‌కు ఇచ్చిన 21.16 ఎకరాల భూమి సుమారు రూ.320 కోట్లకు మించి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం 2012లో జారీ చేసిన జిఒఎంఎస్ 571 ప్రకారం ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వరాదు. 2జి స్పెక్ట్రమ్ కేసులో, ఇతర కేసుల్లో ప్రభుత్వ భూముల వంటి ప్రకృతి వనరుల విషయంలో ప్రభుత్వం ప్రజల ట్రస్టీగా మాత్రమే వ్యవహరించాలని, ఆ భూములను ప్రజా ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ సంస్థలకు మార్కెట్ ధర కన్నా తక్కువకు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలిచ్చిన విషయం అందరికీ తెలిసిందే! కనుక రాష్ట్ర ప్రభుత్వ విధానాలనేగాక సుప్రీంకోర్టు ఉత్తర్వులను కూడా టిడిపి కూటమి సర్కారు ఉల్లంఘించినట్లే. ఒక్క 2024 ఏడాదిలో టిసిఎస్ రూ.62,165 కోట్ల లాభం గడిరచగా అటువంటి కంపెనీకి 99 పైసల లీజుకు విలువైన ప్రభుత్వ భూమిని ముట్టజెప్పడం హాస్యాస్పదం. నిజానికి భూములను ప్రైవేట్ సంస్థలే కొనుగోలు చేయించేలా చూడాలి. 99 పైసలకు ఇవ్వడమన్నది ఎక్కడి విధానమో చంద్రబాబు కూటమి ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. నయా ఉదారవాద విధానాల్లో ముఖ్యాంశమైన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అమలుకు ఇది తాజా ఉదాహరణ. ఈ నిర్ణయం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమన్న మేధావుల విమర్శలు పట్టించుకోవడం లేదు. ఇంత చౌకగా ఊమిని కట్టబెట్టడం, అదీ టిసిఎస్ లాంటి సంస్థకు కట్టబెట్టడం అసవరమా అన్నది ఆలోచనచేయాలి. ఆ భూ పందేరాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయడం అవసరం. ఆ ప్రాంతంలో టిసిఎస్ కంపెనీ ఒక ఐటి పరిశ్రమను పెట్టి 12 వేల ఉద్యోగాలు కల్పిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెబుతోంది కానీ గతంలో చాలా కంపెనీల యజమాన్యాలు పెట్టుబడులు పెడతామని, ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి చౌకగా ప్రభుత్వ భూములు తీసుకున్నారేతప్ప యువతకు ఉద్యోగాలు కల్పించలేదు. భూములు ప్రైవేటు కంపెనీల ఆధీనంలోనే ఉండడమేగాక వాటిని బ్యాంకుల్లో కుదువబెట్టి భారీగా రుణాలు తీసుకుని, ఆ తరవాత వాటినీ ఎగ్గొట్టిన ఉదంతాలెన్నో ఉన్నాయి. అనంతపురం లేపాక్షి మొదలు ఒంగోలు వాన్‌పిక్ శ్రీకాకుళం జిల్లా థర్మల్ కేంద్రాల వరకూ వేల ఎకరాల భూములు కార్పొరేట్ కంపెనీల కబంధ హస్తాల్లో చిక్కుకున్న విషయం చంద్రబాబుకు తెలియందికాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడా ఇలాంటి పందేరాలు చూస్తూ ఉండడం సరికాదు. వందలు, వేల ఎకరాలను సంపన్నులకు కట్టబెట్టే ప్రభుత్వ పెద్దలు ఒక్క సెంటు జాగా కూడా పేదలకు ఇవ్వరు. పేదల ఇళ్లకు మాత్రం మీనమేషాలు లెక్కబెడతారు. పడావు భూముల్లో గుడిసెలు వేసుకుంటే వాటిని కూల్చి అరెస్టు చేయమని, లాఠీలకు పని చెప్పమనీ పోలీసులను పురమాయిస్తారు. ప్రజల సొత్తును, ప్రకృతి సంపదను అధికారంలో వున్నవారు తమ అనుయాయులకు కట్టబెట్టే ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం దాదాపు గత నాలుగు దశాబ్దాలుగా అమలవుతోంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, వైఎస్ హయాంలో ఇలాంటి పందేరాలు సాగాయి. ఇప్పుడు చంద్రబాబు మరోమారు తన గారడీ ప్రదర్శిస్తున్నారు. రేవంత్ సరకార్ తెలంగాణ కూడా ఫార్మాపేరుతో ఇలాగే వ్యవహరిస్తోంది. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వం కూడా ఇదే పెడధోరణిని సాగించింది. ఇప్పుడేమో భూముల పందేరంపై నంగనాచిలా కొట్లాట చేస్తోంది. భూములను కట్టబెట్టడంలో అంతా ఒకే తాను ముక్కలన్నది ప్రజలు గ్రహించాలి. ఇకపోతే ఉమ్మడి ఎపిలో 2006 నుండి 2011 మధ్య 88,492 ఎకరాల భూమిని వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 1,027 వివిధ కంపెనీలకు కట్టబెట్టింది. తద్వారా రాష్ట్ర ఖజానా అక్షరాలా లక్ష కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయిందని కాగ్ తేల్చింది. ఈ విధానాలను దేశంలోకి తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ కాగా ప్రస్తుతం ఓడరేవుల మొదలు విమానాశ్రయాలను సైతం అదానీ, అంబానీలకు కట్టబెడుతున్న బిజెపి కేంద్ర ప్రభుత్వ తీరు చూస్తూనే ఉన్నాం. గంగవరం పోర్టు కోసం పోరాటం చేసి భూములు అప్పగించిన వారు ఇప్పుడు నిరాశ్రయులయ్యారు. కానీ ఆ భూములను, పోర్టును ఆదానీ ఎగురేసుకు పోయారు. కారుచౌకగా భూములు అప్పగించడం, అనుచితమైన రాయితీలివ్వడం, చట్టాలను సడలించే విధానాలతో వచ్చే పెట్టుబడులు రాష్ట్రానికిగానీ, ప్రజలకుగానీ దీర్ఘకాలికమైన ప్రయోజనాలు కలిగించిన దాఖలాలు లేవు. టిసిఎస్ విశాఖలో 12 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నా ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇతర ఐటి కంపెనీలతో పాటు ఉద్యోగుల సంఖ్య తగ్గించే దిశలో ఆ కంపెనీ కూడా ఉంది. ఈ విషయాలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం టిసిఎస్ విషయంలో తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి. రుషికొండలోని ప్రభుత్వ భూమిని మార్కెట్ ధరకు కేటాయించి, ఆదాయాన్ని రాబట్టుకోవాలి.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు !!!

* మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి

**శివంపేట ఏప్రిల్ 22 (సమయం న్యూస్) :** శివంపేట్ మండలంలోని శివంపేట్, పాంబండ, పోతులబోగుల, కొత్తపేట్, తాళ్లపల్లి తండా, మరియు మల్లుపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి , శివంపేట్ మండల్ పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ప్రారంభం చేయడం జరిగింది మెదక్ జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ చిలుముల సువాసిని రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను కనువులు చేస్తామని, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తాము. దళారులు నమ్మి మోసపోవద్దని చెప్పారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు నవీన్ గుప్తా, మాధవరెడ్డి, తాజా మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్, పాక్స్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ అంజిరెడ్డి, పాక్స్ డైరెక్టర్ పెంటా గౌడ్, పాక్స్ డైరెక్టర్ బల్వంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు, ప్రవీణ్ ముదిరాజ్, శివుడు, తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా



గౌరవ అధ్యక్షులు అక్కముల్ల మైసయ్య యాదవ్ మైసయ్య, గణేష్, గేమ్ సింగ్, కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, గ్రామాల రైతులు, మరియు సీవీర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఇంటర్ ఫలితాల్లో విజేత విద్యా సంస్థలలో విద్యార్థుల విజయకేతనం

**బోధన్ పట్టణం, 22 ఏప్రిల్, సమయం న్యూస్ :** 2025 మార్చ్ లో ఇంటర్మీడియట్ బోర్డ్ వారిచే నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షల ఫలితాలను 22 ఏప్రిల్ మంగళవారం రోజున విడుదల చేయడం జరిగింది. బోధన్ పట్టణంలోని విజేత జూనియర్ కళాశాల, సాయి విజేత జూనియర్ మహిళ కళాశాలలోని విద్యార్థులను విజయకేతనం ఎగరవేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను ఎంపీసీ గ్రూప్ నుండి బి.పవిత్ర 994 మార్కులతో రాష్ట్రస్థాయిలో బోధన్ డివిజన్ స్థాయిలో మొదటి స్థానం, సిహెచ్. హర్షిత్ 991 మార్కులు, బైపిసి గ్రూప్ నుండి బి.అక్షయ 990 మార్కులతో రాష్ట్రస్థాయిలో 4వ స్థానం లో నిలిచారు. మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్ లో 470 మార్కులకు గాను కే.ప్రశాంత్ 468 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకును, మహేష్ 464 మార్కులను, బైపీసీ గ్రూప్ నుండి జి.శ్రావ్య 434/440 మార్కులను సాధించడం జరిగిందని కళాశాల నిర్వాహకులు రమణారెడ్డి తెలిపారు. ఇంతటి ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందిస్తూ ఈ ఫలితాలు రావడానికి కృషి చేసిన మా కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి మాపై నమ్మకముంచి పిల్లల్ని మా దగ్గరికి పంపిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఫలితాలను సాధించేందుకు అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు.

## నేరాల నియంత్రణకే

# పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

* ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత
* మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి

**మందమర్రి, ఏప్రిల్ 22 సమయం న్యూస్:** నేరాలను నియంత్రించేందుకే పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి తెలిపారు. రామగుండం కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్ డిఐజి, మంచిర్యాల ఏసిపి ఏ భాస్కర్ ఐపీఎస్, బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ ల ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని కాసీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కోమటి చేను గ్రామంలో పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, సమీపంలో ఎవరైనా కొత్త వ్యక్తులు నివాసం ఉన్న, సంచరించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు ముఖ్యంగా గంజాయి, మద్యం, డ్రగ్స్ లకు బానిసలుగా



మారి, తమ జీవితాలను పాడు చేసుకోకూడదని, చట్ట వ్యతిరేక కార్య క్రమాలకు పాల్పడకూడదన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని లేదా డయల్ 100 కాల్ చేయాలని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని మోసగాళ్ల ఫోన్ కాల్స్, సందేశాలు, వాట్సప్ లింకులు, కాల్స్ ల పట్ల అప్రమత్తంగా ఉండి, స్పందించకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, వాహనం నడపాలని సూచించారు. గ్రామంలో మరింత రక్షణ కొరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటుకు పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సైబర్ నేరాలు, బాల కార్మిక వ్యవస్థ, ఫోక్సో కేసుల నమోదు, శిక్షలు, రోడ్డు ప్రమాదల నివారణ, ఆత్మహత్యలు, లైంగిక వేధింపులు, మూఢనమ్మకాల, గంజాయి వంటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచా రాలపై అదేవిధంగా వివిధ చట్టాలపై ప్రజలను చైతన్యం చేస్తూ, షీ టీం, డయల్ 100 గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా నిషేధిత గంజాయిని విక్రయించిన, రవాణా చేసిన తమకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ సందర్భంగా సరైన ధృవపత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 26 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను గుర్తించి, వాటికి అక్కడికక్కడే జరిమానా వేసి, సరి చేయడం జరిగిందని, అదేవిధంగా రెండు నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోని, సీజ్ చేయడం జరిగిందన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న తనిఖీలో గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న దుర్గం సూర్య ప్రకాష్, రామ్ టెంకి అర్జున్ లపై ఎక్సైజ్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసీపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, మందమర్రి ఎస్ఐ ఎస్ రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ జి రాజశేఖర్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రామకృష్ణాపూర్ నుండి స్కూల్ బస్సును ఏర్పాటు చేయాలి

**మందమర్రి, ఏప్రిల్ 22 సమయం న్యూస్:** సింగరేణి ఏరియాలోని రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి కార్మికుల ఉద్యోగుల పిల్లల విద్యాభివృద్ధికై రామకృష్ణాపూర్ పట్టణం నుండి మంచిర్యాలకు స్కూల్ బస్సును సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి, ఏరియా కార్యదర్శి అల్లి రాజేందర్ లు కోరారు. ఈమేరకు మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఏరియా జిఎం కార్యాలయంలో ఏరియా జిఎం దేవేందర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏరియాలోని రామకృష్ణాపూర్ పట్టణంలో సింగరేణి కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికై



రామకృష్ణాపూర్ పట్టణం నుండి మంచిర్యాలలోని ఇతర పాఠశాలలకు స్కూల్ బస్సును సింగరేణి యాజమాన్యం సాధారణ అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కోరారు. రామకృష్ణాపూర్ పట్టణం లోని యువ కార్మికులు వారి పిల్లలను చాలా మందిని మంచిర్యాల పట్టణంలోని వివిధ పాఠశాలలో చదివిస్తున్నారని, ఆయా పాఠశాలల యాజమాన్యాలు అధికంగా బస్సు ఫీజులు వసూలు చేయడంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు.



సింగరేణి ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు వారి పిల్లలకు సైతం ఈ సమస్య మూలంగా ఆసుపత్రిలో పనిచేయడానికి ముందుకు రావడం లేదన్నారు. సింగరేణి యాజమాన్యం గోదావరిఖని, జైపూర్ థర్మల్ ప్లాంట్ లో కార్మికుల పిల్లల కోసం సాధారణ అద్దె పద్ధతిన స్కూల్ బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇదేవిధంగా వచ్చే విద్యాసంవత్సరం నుండి రామకృష్ణాపూర్ నుండి సైతం ఉద్యోగుల పిల్లల విద్యాభివృద్ధికై స్కూల్ బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఏరియా జిఎం జి దేవేందర్ సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఏరియా ఆసుపత్రి పిట్ కార్యదర్శి శ్రీకాంత్, ఈశ్వర్, రవికుమార్, షఫీ, తన్వీర్ హుస్సేన్,బాలకృష్ణ రాజేంద్రప్రసాద్, విజయ కుమారి, తిరుపతి రాకేష్ సురేష్ శ్రీకాంత్ లతో పాటు కార్మికులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీ విజయ సాయి విద్యా సంస్థలలో విద్యార్థుల విజయకేతనం

బోధన్ పట్టణం, 22 ఏప్రిల్, సమయం న్యూస్ : 2025 మార్చ్ లో ఇంటర్మీడియట్ బోర్డ్ వారిచే నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షల ఫలితాలను 22 ఏప్రిల్ మంగళవారం రోజున విడుదల చేయడం జరిగింది. బోధన్ పట్టణంలోని శ్రీ విజయ సాయి విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో విరాజిల్లారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను ఎంపీసీ గ్రూప్ నుండి ఎం.హోమ 982, ఐ.మహేందర్ 973 మార్కులు, బైపిసి గ్రూప్ నుండి టి.ప్రణీత్ గౌడ్ 946 మార్కులను సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్ లో డి.నితిన్ 468/470 మార్కులను, బైపీసీ గ్రూప్ నుండి కే.అభిరామ్ 413/440 మార్కులను, సిఇసి గ్రూప్ నుండి సఇష్ట బేగం 448/500, ఒకేషనల్ గ్రూప్ లో ఫరెహ తజ్మీన్ 430/500 మార్కులను సాధించడం జరిగిందని కళాశాలల నిర్వాహకులు సుబ్బారావు తెలిపారు. ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించినందుకు విద్యార్థులను అభినందిస్తూ ఇందుకోసం పాటుపడిన మా అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి మాపై నమ్మకం ఉంచిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేస్తామని అన్నారు.

# డంప్ యార్డ్ అక్రమాలపై బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ ఆగ్రహం



బోధన్, ఏప్రిల్ 22, సమయం న్యూస్ : బోధన్ మున్సిపాలిటీలో జరుగుతున్న డంప్ యార్డ్ అక్రమాలపై బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశం నిర్వహించిన ఆయన, డంప్ యార్డ్ అంశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ పాత్ర శూన్యమని, అసలు రూ.70 లక్షలు సిడిఎంఏ ద్వారా కాంట్రాక్టర్ ఖాతాలో జమయ్యాయని వెల్లడించారు. ఇటీవలి కథనాల నేపథ్యంలో, ఈ అంశంపై సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం సమర్పించామన్నారు. క్లోరిన్ బ్లీచింగ్, వాటర్ పైప్‌లైన్ వంటి ప్రాజెక్టులలోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

*** ఎమ్మెల్యే స్పందించకపోవడంపై విమర్శలు**

అలాంటి కీలక అంశాలపై బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందించకపోవడం ఆందోళనకరమని రవీందర్ యాదవ్ అభిప్రాయపడ్డారు. మున్సిపాలిటీ అక్రమాలపై సీబీఐతో పాటు ప్రత్యేక అధికారులతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

*** ప్రజలలో అనుమానాలు**

డంపింగ్ యార్డ్ విషయంలో కొందరు రాజకీయ నాయకులకు ఉండే ఆసక్తిపై ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని వ్యాఖ్యానించారు. "మున్సిపల్ అధికారులు ఉన్నారా? లేక బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారా?" అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రజాక్, బెంజరీ గంగారం, అశ్వక్, రవిశంకర్ గౌడ్, శంకర్ గౌడ్, ఎన్ఆర్ఐ అహ్మద్, శ్రీనివాస్ రావు, మేడి రవి తదితరులు పాల్గొన్నారు.



## కంటైనర్ క్లినిక్ ను ప్రారంభించిన ఖేడ్ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**కంగ్టి,22 ఏప్రిల్ (సమయం న్యూస్) :** కంగ్టి మండల కేంద్రంలో ఇండియన్ ఆయిల్ సిఎస్ఆర్ సంస్థ ఏర్పాటు చేసిన కంటైనర్ క్లినిక్ ను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్. పి.సంజీవరెడ్డి మరియు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కంటైనర్ క్లినిక్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో CDC చైర్మన్ షాదుల్, మండల స్థాయి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మందమర్రి, ఏప్రిల్ 22 సమయం న్యూస్:** పట్టణంలో ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ 6వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమోద్దీన్, ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్ లు మాట్లాడుతూ, నేటి యువత చెడు మార్గంలో వెళ్తున్న తరుణంలో ఆ మార్గాన్ని ఎంచుకోకుండా, ప్రజలకు సేవ చేయాలనే మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. గత ఐదు సంవత్సరాలుగా తమకు సహకరించి, తమ ముందుండి, అన్ని విధాలుగా సహకరించిన వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గత ఆరు సంవత్సరాల క్రితం ఇద్దరు వ్యక్తులతో మొదలై, నేడు వందలాది మందితో సొసైటీ ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా గత ఆరు సంవత్సరాలుగా సొసైటీ ఆధ్వర్యంలో చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. భవిష్యత్తులోనూ అందరి సహాయ సహకారాలు ఇదేవిధంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి తమ వంతుగా మంచి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజ్ కుమార్, జిల్లా కార్యదర్శి గాండ్ల సంజీవ్, మండల అధ్యక్షుడు సకినాల శంకర్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఓరం కవిరాజ్, సభ్యులు దాడి రాజు, అబీద్, కిరణ్, చరణ్, చింటూ, అజయ్, సుందర్ లు పాల్గొన్నారు.



మంగళవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో నర్సాపూర్ పట్టణానికి చెందిన పాప గారి నరశ్రీవాస్తవ్ గౌడ్ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ లో 470 గాను 464 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు హైదరాబాదులోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఎంతో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించినందుకు కుటుంబ సభ్యులు సంతోషించారు.

*నర్సాపూర్ ఏప్రిల్ 22, (సమయం న్యూస్):*

# బొగ్గు గనుల వేలంలో పాల్గొనవద్దు



**మందమర్రి, ఏప్రిల్ 22 సమయం న్యూస్:** సింగరేణి ఉనికికే ప్రమాదంగా మారిన బొగ్గు గనుల వేలంలో పాల్గొనవద్దని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ దశలవారి పోరాటంలో భాగంగా యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏరియాలోని కేకే 5 గని, కాసీపేట 1 గనిపై ఆందోళన నిర్వహించి, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సింగరేణి అధికారులకు అందజేశారు. కేకే 5 గనిపై నిర్వహించిన కార్యక్రమానికి యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కాసీపేట 1 గనిపై నిర్వహించిన కార్యక్రమానికి యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు బెల్లం అశోక్ లు హాజరై, కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణి పరిరక్షణ, నూతన గనుల ఏర్పాటు, సంక్షేమ చర్యలు తదితర వాటిని విస్తృత పరచాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో నూతన గనులు ఏర్పాటు చేయాలని, మెడికల్ రిఫ రల్ విధానాన్ని సులభతరం చేసి, కార్మికులకు అనువైన మెడికల్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రామగుండం, కొత్తగూడెం, బెల్లంపల్లి రీజియన్ లో కార్మికుల కుటుంబాలకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఓ రాజశేఖర్, వీరారెడ్డి,



సారయ్య, మధుసూదన్ రెడ్డి, రవి యాదవ్, బొడ్డు మల్లేష్, కొప్పుశెట్టి శ్రీనివాస్, రాజేష్ నాయక్, శివ నాయక్, వేణు యాదవ్, సీతారాం నాయక్, సాయి, పూలు సంపత్, సొల్లంగి శ్రీనివాస్, బైరి శంకర్, అఫ్జలూద్దీన్, దొమ్మటి రమేష్, సతీష్ వర్మ, బెల్లం అరుణ్, సంగి రవి, శివ, రవి నాయక్, బోగిని రవీందర్, బండారు రమేష్, మున్సి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.




## అంబర్ పేట కార్పొరేటర్ జన్మదిన సందర్భంగా ఉచిత ఆరోగ్య శిబిరం

**అంబర్ పేట, ఏప్రిల్, 22, (సమయం న్యూస్):** అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తాలో సీజన్స్ ఆసుపత్రి వారు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక ప్రజలందరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# హజ్ యాత్రికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి



హైదరాబాద్ ఏప్రిల్ 22 ( సమయం న్యూస్) : మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే హజ్ యాత్రకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అనుబంధ శాఖల అధికారులు మెరుగైన సదుపాయాలు చేపట్టాలని మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాష ఆదేశించారు. హైదరాబాద్ హజ్ హౌస్ లో హజ్ యాత్రపై ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. హజ్ యాత్రలో భాగంగా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర అలాగే మరి కొన్ని రాష్ట్రాల నుండి 11,000 మందికి పైగా హజ్ యాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఎక్కడ కూడా సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని శాఖల అధికారులు చేపట్టే అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం హజ్ యాత్రను అత్యంత ప్రాధాన్యత తీసుకుంటుందని ఆ దిశగా అధికారులు నిబద్ధత, సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా యాస్మీన్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ప్రతి అధికారి నిబంధనలకు లోబడి పనిచేయాలని హజ్ యాత్ర సందర్భంగా యాత్రికులకు హైదరాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నుండి విమానాలు ఈ నెల 29 నుండి మే 29, 2025 వరకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మదీనాకు ఏప్రిల్ 29 నుండి మే 13 వరకు అలాగే జిద్దాకు మే 16 నుండి మే 29 వరకు విమానాలు నడుస్తాయని తెలిపారు. జిద్దా నుండి తిరిగి వచ్చే విమానాలు జూన్ 12 నుండి జూలై 9, వరకు మధ్య నడుస్తాయని, 31 విమానాలు యాత్రికుల అందుబాటులో ఉంటాయని ఆమె పేర్కొన్నారు. యాత్రికులు తమ నిర్ణీత రిపోర్టింగ్ సమయాలను ఖచ్చితంగా పాటించాలని, విమాన షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులు అనుమతించబడవని ఆమె తెలిపారు. టిజిఆర్టిసి రవాణా కోసం తగిన సంఖ్యలో బస్సులను సమకూర్చాలని, అత్యవసర పరిస్థితుల కోసం మరి కొన్ని వాహనాలను సిద్ధం చేయాలని సూచించారు. ఎస్‌బిఐ బ్యాంక్ రేట్లతో యాత్రికుల కరెన్సీ మార్పిడి సౌకర్యం కల్పించాలని, ఎస్‌బిఐ యాత్రికులకు బ్యాగ్ పౌచ్ మరియు కరెన్సీ సేవలను ఉపయోగించే వారికి 10 లక్షల రూపాయల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ అందించనున్నట్లు తెలిపారు. వెయిటింగ్ లిస్ట్ లో ఉన్న యాత్రికులు ధృవీకరణ తర్వాత ఎస్‌బిఐ కౌంటర్‌లో చెల్లింపులు చేయవచ్చని సూచించారు. సమయానికి వెళ్లలేని వారికోసం సౌత్ సెంట్రల్ రైల్వే అవసరమైన యాత్రికుల కోసం హైదరాబాద్ నుండి ఎంబార్కేషన్ పాయింట్లకు రైలు రిజర్వేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. హజ్ హౌస్ లో ఏర్పాటు చేయనున్న స్టాల్స్ షామియానాలలో జిహెచ్ఎంసి సిబ్బంది చెత్త సేకరణ, పరిశుభ్రత కోసం డస్ట్‌బిన్‌లు అలాగే స్కావెంజింగ్ సేవలను నిరంతరం కొనసాగాలని సూచించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి హజ్ హౌస్‌లోని 20 గదులకు నీటి సరఫరా మరియు సీవరేజ్ నిర్వహణను అందించాలని ఆదేశించబడింది. పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జిల్లా స్థాయి డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లు మరియు ఏరియా హాస్పిటల్స్‌లో వ్యాక్సినేషన్‌లను నిర్వహించాలని, హజ్ హౌస్‌లో హెల్త్ డెస్క్ ఏర్పాటు చేయాలని, ఆధునాతన అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ 24/7 నిరంతరం విద్యుత్ సరఫర, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు మరియు లిఫ్ట్ ఆపరేటర్లను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. బిఎస్ఎన్ఎల్ ఎస్‌టిడి/ఐఎస్‌డి టెలిఫోన్ కనెక్షన్లను ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీస్ శాఖ సిసిటివి నిఘా, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ నిర్వహణ చేపట్టాలని అవసరమైతే మరికొన్ని సీసీ కెమెరాలను అందించడం జరుగుతుందని సూచించారు. అగ్నిమాపక శాఖ వేసవి దృష్ట్యా ఎలాంటి సంఘటనలు జరగకుండా చుడాలని సూచించారు. ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్స్‌లో రెండు చక్రాలు, నాలుగు చక్రాల వాహనాల కోసం ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో యాత్రికుల సౌకర్యం మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, నీటి నిలవాలని చూసుకోవాలని అలాగే హజ్ హౌస్ లో ఉన్న టాయిలెట్ల మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలని అలాగే సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని సూచించారు. మెడికల్ శాఖ నుండి 24/7 సర్వీస్ అందించాలని మెడికల్ క్యాంపు నిర్వహణతో పాటు రెండు కొత్త అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని అలాగే గుర్తించిన ఆసుపత్రుల్లో బెడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

## గూడూరు గ్రామ కొత్తపేట వర్షిని ప్రతిభ 464/470



శివంపేట ఏప్రిల్ 22(సమయం న్యూస్) : శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామానికి చెందిన కొత్తపేట అర్చన రమేష్ గౌడ్ దంపతుల కూతురు కొత్తపేట వర్షిని మంగళవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రతిభ కనబరిచారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. కొత్తపేట వర్షిని ఒక ప్రైవేట్ కళాశాలలో ఎంతో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించినందుకు కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు సంతోషించారు.



## నేడు భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సు

* **మండల తహశీల్దార్ సతీష్ కుమార్**

మందమర్రి, ఏప్రిల్ 22 సమయం న్యూస్: భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపరిచిన అంశాలను రైతులు తెలుసుకోవాలని మండల తహశీల్దార్ పి సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని సండ్రోన్ పల్లి గ్రామం వద్ద గల రైతు వేదికలో భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంతో భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని, భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, అవగాహన సదస్సును విజయవంతం చేయాలని కోరారు.



## వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించిన విద్యార్థులు, సామాజిక కార్యకర్త సనా పటేల్

బోధన్ పట్టణం, ఏప్రిల్ 22, సమయం న్యూస్: బోధన్ పట్టణంలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పాఠశాల విద్యార్థులు, సామాజిక కార్యకర్త సనాపటేల్ ఆధ్వర్యంలో మం గళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సనా పటేల్ మాట్లాడుతూ వక్ఫ్ సంపత్తుల పరిరక్షణకు బిల్లు హానికరమని అభిప్రాయపడుతూ, కేంద్ర ప్రభుత్వం తిరిగి ఆలోచించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోణంలో ఈ బిల్లును తిరస్కరించాలనీ వీరు డిమాండ్ చేశారు.



## గాంధీనగర్ సెంటర్లో పోషణ పక్వాడ కార్యక్రమం ఘనంగా నిర్వహణ

బోధన్ పట్టణం, ఏప్రిల్ 22, సమయం న్యూస్ : బోధన్ పట్టణం, 13వ వార్డు గాంధీనగర్ సెంటర్లో మంగళవారం రోజున ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సూపర్వైజర్ రాధిక నేతృత్వంలో 2025 పోషణ పక్వాడ కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ రాధిక మాట్లాడుతూ "1000 డేస్" ప్రాముఖ్యతను వివరించడమే కాకుండా, చిన్నారులతో హ్యాండ్ వాష్ ప్రాక్టీస్, శ్రీమంతాల కార్యక్రమం, అన్నప్రాసన వంటి చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు లక్ష్మీ, పుష్ప, రాణి, శేషమ్మ, శ్యామల, కళావతి, లక్ష్మి సరోజ, ఆయమ్మ కాంతాబాయి పాల్గొన్నారు. పిల్లల తల్లులు పెద్దఎత్తున పాల్గొని, పోషణపై అవగాహన పొందారు. పోషణ పక్షం లక్ష్యం:* తల్లి మరియు శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, పోషకాహారం ప్రాముఖ్యతను జనాల్లోకి తీసుకెళ్లడం. ఈ తరహా కార్యక్రమాలు బాలల ఆరోగ్యం కోసం ఎంతో అవసరమని టీచర్లు తెలిపారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలలో పాల్గొన్న
# మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి





బోధన్ పట్టణం, ఏప్రిల్ 22, సమయం న్యూస్ : బోధన్, నిజామాబాద్ జిల్లా - మంగళవారం రోజున బోధన్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో మాజీ మంత్రి, బోధన్ శాసనసభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పలువురు అధికారులతో కలిసి పాల్గొన్నారు. స్థానికంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమాలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మరియు పట్టణ గ్రంథాలయంలో నిర్మించిన నూతన రీడింగ్ షెడ్‌ను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎక్సైజ్ స్టేషన్ ప్రారంభ అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, శాఖ పనితీరును సమీక్షించారు. గ్రంథాలయంలో నిర్వహించిన రీడింగ్ షెడ్ ప్రారంభోత్సవంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్ బిన్ హందాన్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్ మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ జరిపారు. పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థుల సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వం విద్యార్థుల అభ్యాసానికి అవసరమైన వనరులను కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు.

* **విద్యార్థులకు ఎమ్మెల్యే పిలుపు: లక్ష్యాన్ని ఏర్పరచుకుని విజయం సాధించండి.**

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఏకాగ్రతతో చదివి, ప్రభుత్వ వనరులను సద్వినియోగం చేసుకుంటే విజయాన్ని సాధించగలరు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోంది," అని అన్నారు. తదుపరి కార్యక్రమంగా బోధన్ పట్టణంలోని 15వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. నిర్మాణ స్థితిగతులను అడిగి తెలుసుకొని, మరింత లబ్ధికై అర్హుల వివరాలను సేకరించి నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ, ఎమ్మార్వో విఠల్, ప్రభుత్వ అధికారులు, డిపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, బోధన్ కాంగ్రెస్ నాయకులు తూము శరత్ రెడ్డి, అంకు దాము, నాగేశ్వరరావు, హరికాంత్ చారి, కర్నే హనుమంత్ రావు, పౌల్, అల్లే రమేష్, సంజీవ్ రెడ్డి, ఆదినారాయణ, గుండెడి శంకర్, తలారి నవీన్, జహీర్ తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు బోధన్ పట్టణంలో ప్రజలకు మౌలిక వసతులను అందించడంలో కీలకంగా నిలుస్తాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

# ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలో ఎకో టూరిజం

* **ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడి**
* **కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష**



నిజామాబాద్, ఏప్రిల్ 22 (సమయం న్యూస్) : తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాలను ఎకో టూరిజం ప్రదేశాలుగా తీర్చిదిద్దుతామని ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే నందిపేట మండలం ఉమ్మెడ, జలాల్పూర్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించేందుకు ఎకో టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్ తో కలిసి సీసీఎఫ్ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం నిజామాబాద్ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి అటవీ, రెవెన్యూ, నీటి పారుదల తదితర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలో ఎకో టూరిజం అభివృద్ధి కోసం అనువైన పరిస్థితుల గురించి కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సమగ్ర వివరాలతో నివేదికలు సమర్పిస్తే, తక్షణమే మంజూరీ తెలుపుతూ, నిధులు కేటాయిస్తామని అన్నారు. రాష్ట్రంలోని అనువైన ప్రాంతాలను పర్యావరణహితంతో కూడిన పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ఎకో టూరిజం అభివృద్ధి చర్యలలో భాగంగా 25 సఫారీ వాహనాలను కొనుగోలు చేశామన్నారు. ఎకో టూరిజం అభివృద్ధితో ప్రజలకు కూడా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. నందిపేటలో ఎకో టూరిజం అభివృద్ధి పనులలో భాగంగా సఫారీ వాహనాల కొనుగోలు, వాచ్ టవర్, పార్కింగ్ ప్రదేశం, రెస్టారెంట్లను మొదటగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలు అయిన ఉమ్మెడలో 1.20 ఎకరాలు, జలాల్పూర్ లో 3 ఎకరాలలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మెడ నుండి బాసర వరకు బోటింగ్ ప్రణాళికను కూడా సిద్ధం చేస్తామని అన్నారు. అలాగే ఉమ్మెడ నుండి గాదెపల్లి వరకు 20 కి.మీ, గాదెపల్లి నుండి జలాల్పూర్ వరకు 16 కి మీ సఫారీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. 3 రోజులలో సమగ్ర ప్రణాళికలు, కావల్సిన నిధుల వివరాలతో నివేదిక సమర్పిస్తే, వెంటనే బడ్జెట్ విడుదల చేస్తామన్నారు. ఈ సమీక్షలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, ఆర్డీఓ రాజాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నూతన భూభారతి చట్టంతో
# రైతులకు గట్ల పంచాయతీలు లేని జిల్లాగా తీర్చి దిద్దాలి

* **భూ సమస్యల పరిష్కార మార్గాలు సులభం**
* **రైతులకు భూమి గుండె కాయ**
* **భూ సమస్యలు త్వరితగతిన సులభంగా పరిష్కరించబడతాయి.**
* **భూ భారతి చట్టం అవగాహన సదస్సులలో కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**సంగారెడ్డి ఏప్రిల్22( సమయం న్యూస్) :** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. ఈ చట్టంలోని అంశాలపై గ్రామాలలో విస్తృతంగా చర్చిస్తూ, తోటి రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. మంగళ వారం కాంగ్టి, కల్హేర్ మండలలలో భూభారతి చట్టం అవగాహన సద స్సులలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ మాధురి లతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ భూభారతి చట్టంతో రైతులకు గట్ల వద్ద పంచా యతీ లు లేని జిల్లా గా తీర్చి దిద్దాలి అని అన్నారు. రైతులకు చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశం వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాది కాలం లోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్ కు లేదా సీసీఎల్ఏ కు అప్పీల్ చేసుకోవచ్చని, ఈ చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా అందుబాటులో ఉంటుందని సూచించారు. ధరణి లో రెవెన్యూ కోర్టులను తొలగించడం వల్ల భూ వివాదాల విషయంలో రైతులు సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుత భూభారతి చట్టం ద్వారా ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులు పునరుద్ధరించిందని వివరించారు. భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునేందుకు



రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని తెలిపారు. అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదని రైతులు భావిస్తే అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. ఆర్థిక స్థోమత లేని పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం కూడా సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం సరైంది కాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ల్యాండ్ ట్రిబ్యునల్ కు అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు. కాగా, ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధి కారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు వెలువడనున్నాయని తెలిపారు. నారాయణఖేడ్ MLA సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతుల గురించి ఆలోచన చేస్తూ రైతు ప్రయోజనాలను కాపాడుతుందన్నారు. ఏక కాలం లో రుణ మాఫీ జరిగిందని, నారాయణఖేడ్ నియోజక వర్గానికి 250కోట్ల రూపాయల వరకు రుణ మాఫీ జరిగిందని తెలిపారు.

# రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు విచారణ ప్రక్రియ
# మే 20వ తేది వరకు పూర్తి చేయాలి

* జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ఏప్రిల్ 22 (సమయం న్యూస్):** మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు విచారణ ప్రక్రియ, మండల స్థాయిలో విచారణ టీముల ఏర్పాటుపై ఎల్డిఎం, డిఆర్డీఏ, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, ఎంపిడివోలు, బ్యాంకర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి ఎస్సిలు 6711 మంది, ఎస్టీలు 3461 మంది, బిసిలు 19688 మంది, ఈబిసిలు 550 మంది, మైనార్టీలు 2175 మంది, క్రిస్టియన్లు 55మంది దరఖాస్తులు చేసినట్లు తెలిపారు. మండల స్థాయిలో విచారణ చేయుటకు ఎంపిడిఓ, మండల ప్రత్యేక అధికారి, బ్యాంక్ మేనేజర్లు, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఈబిసి అధికారులు, డిఆర్డీఏ సిబ్బందితో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం యూనిట్లు ఏర్పాటు చేయు లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు అందించాలని సూచించారు. లబ్ధిదారుల విచారణ ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగాలని, ఎలాంటి పొరపాట్లు కు తావులేకుండా జరగాలని సూచించారు. మండల స్థాయి విచారణ తదుపరి జిల్లా కమిటీ పరిశీలన చేస్తుందని, తుది జాభితా ఆయా కార్పోరేషన్స్ కు పంపనున్నట్లు తెలిపారు. యూనిట్లు ఏర్పాటును బట్టి ఎంపిక చేసిన లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆఫ్ లైన్, ఆన్లైన్ ద్వారా వచ్చిన అన్ని దరఖాస్తులు జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్, వివిధ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.




## సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ 2025 గోడప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఏప్రిల్ 22 (సమయం న్యూస్):** మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో కలిసి సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ 2025 గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా, విద్యార్థులు క్రీడల్లో శిక్షణను పొందాలన్న ఉద్దేశంతో, సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ ను ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరం మే నెల ఒకటవ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఈ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపు లో భాగంగా అనేకరకాల ఇండోర్, ఔట్ డోర్ ఆటల్లో విద్యార్థులకు శిక్షణను ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, డిఈఓ పి. రామారావు, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలి

: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
* ప్రతి కొనుగోలు కేంద్రం లో ప్యాడి క్లీనర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి
* ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**రామగిరి ,ఏప్రిల్ 22: (సమయం న్యూస్):** యాసంగి పంట కొనుగోలు లో కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలంలోని బేగంపేట, నవాబ్ పేట, కల్వచర్ల గ్రామాలలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ రెవెన్యూ వేణు తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్ ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని శుభ్రం చేసిన తర్వాత తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలని, రెగ్యులర్ గా ధాన్యం తేమ శాతం పరిశీలించాలని అన్నారు. రైస్ మిల్లులకు నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే సరఫరా చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్ కవర్లు, వెయింగ్ యంత్రాలు తేమ యంత్రాలు మొదలగు సామాగ్రి అందుబాటులో పెట్టుకొవాలని అన్నారు. కోనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలు పరిశీలించి, భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని ఆర్డీవో సురేష్, తహసిల్దార్ సుమన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలి

* ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన
* జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్

జనగాం ఏప్రిల్ 22 (సమయం న్యూస్) : మంగళవారం, జిల్లాలోని బచ్చన్నపేట మండలంలోని కొడవటూర్ గ్రామంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తేమ శాతం, తదితర మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. అలాగే సరిపడా టార్పాలిన్లు, గన్ని సంచులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కాంటా అవ్వగానే ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని, ఎలాంటి అలసత్వం తగదని, ఓపీఎంఎస్ లో వెంటనే నమోదు చేయాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్ లను తనిఖీ చేసి, సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకొని, మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కేంద్రం పరిశీలనలో డీటీ సీఎస్ శ్రీనివాస్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ తేజస్



సూర్యాపేట22 (సమయం న్యూస్) : పిఎసియస్, అనాజిపురం గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తేజస్, అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ఆకస్మికంగా మంగళవారం సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ధాన్యం ఎగుమతులు, దిగుమతులు త్వరగా అయ్యేలా చూడాలని , కేటాయించిన మిల్లుల వల్ల ఇబ్బందులు ఎదురైతే తెలపాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని లారీలను ఎక్కువగా పెట్టి రవాణా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆనాజిపురం కొనుగోలు కేంద్రంలో లారీలో లోడ్ అవుతున్న రైతు చేన్ను జయమ్మ ధాన్యంన్ని కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఎక్కువగా ఉండటానికి గమనించి లారీలను ఎక్కువగా పెట్టాలని తాసిల్దార్ కు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ వేణు మాధవ రావు, తాసిల్దార్ ధరావత్ లాలూ నాయక్, వివో అన్న మేరీ,వివోఎ ధనలక్ష్మి, కోశాధికారి సరిత, కార్యదర్శి ఎల్ శిరీష,అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం రైతులకు వరం

* రైతుల పెండింగ్లో ఉన్న సమస్యలు త్వరతగతిన పరిష్కరించాలి
* జిల్లా పాలనాధికారి రాజర్శి షా




ఆదిలాబాద్ ఏప్రిల్22(సమయం న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం భూ యాజమాన్య హక్కులు కాపాడటానికి, రైతులకు భూమికి సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి, భూమికి సంబంధించిన రికార్డులు ఆన్లైన్ ఆఫ్ లైన్ ఉండటం కోసం ఆర్ఓఆర్ చట్టంలో దాదాపు 24 సవరణలు చేసి పారదర్శకంగా భూ భారతి చట్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం తీసుకువచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. బోథ్ మండలంలోని ధన్నూర్ బి , సోనాల గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామస్తులు మేళతాళాలతో విద్యార్థులు గౌరవ వందనం సమర్పిస్తూ స్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధికారులు, గ్రామస్తులు జాతీయ ఉత్తమ పరిపాలన అవార్డు అందుకున్న కలెక్టర్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్ లో పరిష్కారం కానీ అనేక సమస్యలకు భూ భారతి చట్టం పరిష్కారం చేస్తుందని, జిల్లా లెవల్లో కూడా అప్పీల్ కు అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరికి భూదార్ కార్డులు అందిస్తామని, సాదా బైనమ సమస్యలు, అసైన్డ్ భూముల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని గ్రామ పరిపాలన అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ధన్నూర్ గ్రామంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పొలంబాట కార్యక్రమంలో పంట పొలాలకు త్వరలోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు వేయిస్తామని, అటవీ రెవెన్యూ అధికారుల సంయుక్త సర్వే నిర్వహించి అర్హత కలిగిన రైతులకు పట్టాలు అందించే కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టానికి సంబంధించి కల్చరల్ ప్రోగ్రాం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు వేసిన నాటకానికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. దన్నూర్ మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో టి వినోద్ కుమార్, బోథ్ మండల స్పెషల్ ఆఫీసర్ వాజిత్, మండల తహసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ విస్తీర్ణ అధికారి, ఏపీవో, ఏపీఎం, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నవాబ్ పేట్ లో జిల్లా కలెక్టర్ తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయశంకర్ భూపాల్ పల్లి ఏప్రిల్22 సమయం న్యూస్) :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం చిట్యాల మండలం, నవాబ్ పేటలో డిఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగంగా, సమర్థంగా జరగాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని సూచించారు. కొనుగోలులో అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఇటువంటి చర్యల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సమయానుకూలంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎఫ్ఏక్యూ వచ్చిన ధాన్యం కొనుగోలు లో జాప్యం చేయొద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం కేటాయించిన మిల్లులకు రవాణా చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండటం వల్ల అకాల వర్షాల ఇబ్బందులు వస్తాయని అన్నారు. తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే అధికారులదే భాద్యత అని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్డిఓ నరేష్, పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డిఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఫిక్సింగ్ ఆరోపణలు...
# ఖండించిన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఏప్రిల్ 19వ తేదీన లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో రాజస్థాన్ రాయల్స్ 2 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీనిపై రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ తాత్కాలిక అడ్‌హక్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహానీ సందేహాలు లేవనెత్తాడు. ఈ మ్యాచ్ ఫిక్స్ అయ్యిందని తీవ్రమైన ఆరోపణలు చేశాడు. ఈ వ్యాఖ్యలను రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఖండించింది. బిహానీపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, క్రీడా మంత్రి, క్రీడా కార్యదర్శికి అధికారికంగా ఫిర్యాదు చేసింది. అలాగే... రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కు చెందిన సీనియర్ అధికారి దీప్ రాయ్.. ఈ వ్యాఖ్యలను తోసి పుచ్చారు. 'బిహానీ చేసినవి తప్పుడు ఆరోపణలు. అవి నిరాధారమైనవి' అని ఖండించారు. మరో వైపు జయదీప్ బిహానీ జట్టు



ప్రదర్శనపై అనుమానం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. రాజస్థాన్ రాయల్స్, రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, భారత క్రికెట్ నియంత్రణ మండలి.. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ తాత్కాలిక కమిటీని ఐపీఎల్ సంబంధిత కార్యకలాపాల నుంచి పక్కన పెట్టడానికి కుట్ర పన్నాయని ఆరోపించారు. అయితే ఈ వాదనలపై రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం తీవ్ర అభ్యంతరం తెలిపింది. "బిహానీ చేసిన అన్ని ఆరోపణలను మేం ఖండిస్తున్నాం. ఇటువంటి బహిరంగ ప్రకటనలు తప్పుదారి పట్టించడమే కాకుండా రాజస్థాన్ రాయల్స్, రాయల్ మల్టీ స్పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, బీసీసీఐ ఖ్యాతి, విశ్వసనీయతకు తీవ్ర నష్టం కలిగించాయి. అవి క్రికెట్ సమగ్రతను కూడా దెబ్బతీశాయి' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. 'బీసీసీఐ ప్రస్తుత ఏర్పాట్ల ప్రకారం, ఈ సీజన్ కోసం జైపుర్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించే అధికారిక హక్కులను రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్ కలిగి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో కౌన్సిల్, బీసీసీఐతో సమన్వయంతో పనిచేస్తున్నాం' అని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా... ఓ సందర్భంలో బిహానీ మాట్లాడుతూ.. 'గతంలో రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (RCA) రాష్ట్రంలో అంతర్జాతీయ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించింది.

## రోజుకు 5 లీటర్ల పాలు తాగుతాడన్న వార్తలపై ధోనీ రియాక్షన్

భారత క్రికెట్ దిగ్గజం, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ, తన ఆహారపు అలవాట్ల గురించి, కండబలం గురించి ఎన్నో సంవత్సరాలుగా చలామణిలో ఉన్న కొన్ని విపరీతమైన వదంతులపై ఎట్టకేలకు స్పందించారు. ముఖ్యంగా తాను రోజూ ఐదు లీటర్ల పాలు తాగుతాననే ప్రచారాన్ని, వాషింగ్ మెషీన్‌లో భారీ పరిమాణంలో లస్సీ చేసుకుంటాననే పుకార్లను ఆయన నవ్వుతూ కొట్టిపారేశారు. క్రికెట్ ప్రపంచంలోకి ధోనీ అడుగుపెట్టిన తొలినాళ్లలో, ఆయన అద్భుతమైన ఫిట్‌నెస్, మైదానంలో బంతిని బలంగా బాదే సామర్థ్యం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇదే సమయంలో ఆయన ఆహారపు అలవాట్లపై అనేక ఊహాగానాలు మొదలయ్యాయి. ముఖ్యంగా, ధోని రోజూ ఐదు లీటర్ల పాలు తాగుతారని, అదే ఆయన భారీ సిక్సర్ల వెనుక రహస్యమని ఒక బలమైన వదంతి దేశవ్యాప్తంగా వ్యాపించింది. దీనికి తోడు, ఆయన వాషింగ్ మెషీన్‌లో లీటర్ల కొద్దీ లస్సీని తయారుచేసుకుంటారని మరో వింత పుకారు కూడా షికారు చేసింది. ఇటీవల చెన్నైలో జరిగిన ఒక ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ధోనీని, ఈ ఏళ్లనాటి వదంతుల గురించి మీడియా మిత్రులు అడిగారు. దీనికి ధోనీ నవ్వుతూ, "నేను రోజుకు ఐదు లీటర్ల పాలు తాగుతానా?" అని బదులిచ్చారు. ఆ తర్వాత అసలు విషయం చెబుతూ, "నేను బహుశా రోజంతా కలిపి ఒక లీటరు పాలు తాగేవాడినేమో. కానీ రోజుకు ఐదు లీటర్లు తాగడం అనేది ఎవరికైనా చాలా కష్టమే" అని స్పష్టం చేశారు.

## 2026 ఆస్కార్ వివరాలు.. ఈసారి ఏఐ చిత్రాలకు కూడా అవార్డు!




సినీ పరిశ్రమ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల వేడుక వివరాలు తాజాగా అకాడమీ వెల్లడించింది. 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15న జరగనున్నట్లు తెలిపింది. ఈసారి కొన్ని కొత్త నిబంధనలను ప్రవేశ పెట్టింది. ఆస్కార్ కోసం పోటీ పడనున్న చిత్రాల జాబితాను 2026 జనవరి 22న ప్రకటించనున్నట్లు అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ వెల్లడించింది. కొన్ని కేటగిరీల్లో ఓటింగ్ విధానంలో మార్పులు చేసినట్లు తెలిపింది. నామినేట్ చేసిన ప్రతి చిత్రాన్ని అకాడమీ సభ్యులు కచ్చితంగా వీక్షించాలని పేర్కొంది. అలాగే అచీవ్‌మెంట్ ఇన్ కాస్టింగ్ అనే కేటగిరీని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ కేటగిరీకి రెండు దశల్లో ఓటింగ్ ప్రక్రియ ఉండనున్నట్లు వెల్లడించింది. ఫైనల్ ఓటింగ్ ముందు కాస్టింగ్ డైరెక్టర్లకు కొన్ని రౌండ్ల టెస్టింగ్ ఉంటుందని వెల్లడించింది.

**ఏఐ చిత్రాలకు కూడా ఆస్కార్!**

చిత్ర పరిశ్రమలో పెరుగుతోన్న టెక్నాలజీని దృష్టిలోపెట్టుకున్న అకాడమీ.. ఈసారి ఏఐ ఉపయోగించి తీసిన చిత్రాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు వెల్లడించింది. అయితే ఇది ఇతర చిత్రాలపై ప్రభావం చూపదని పేర్కొంది. ఏఐ చిత్రాల కంటే మామూలు వాటికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని అకాడమీ తెలిపింది. మానవ మేధస్సుకే తొలిప్రాధాన్యం ఉంటుందని వెల్లడించింది. లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో ఈ 98వ ఆస్కార్ వేడుక జరగనుంది. 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు విడుదలైన చిత్రాలు పోటీపడనున్నాయి. అయితే మ్యూజిక్ కేటగిరీలో మాత్రం తుది గడువు 2025 అక్టోబర్ 15గా నిర్ణయించింది. ఇక అకాడమీ 'స్టంట్ డిజైన్' జాబితాలోనూ అవార్డులు ఇవ్వనున్నట్లు ఇటీవల అధికారికంగా వెల్లడించిన విషయం తెలిసిందే. 2027 నుంచి విడుదల కానున్న చిత్రాలను ఈ జాబితాలో ఎంపిక చేసి అవార్డులు ఇవ్వనున్నారు.

# సినిమా

## మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు



టాలీవుడ్ సూపర్ స్టార్, ప్రిన్స్ మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు పంపింది. ఈనెల 27న హైదరాబాదులోని కార్యాలయం ఎదుట విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. సాయి సూర్య డెవలపర్స్ తో పాటు సురానా గ్రూపు కంపెనీ వ్యవహారంలో ఈడీ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంది. పెట్టుబడులు పెట్టేందుకు సామాన్యులను ఇన్ ఫ్లుయెన్స్ చేశారని ఆయనపై అభియోగం మోపింది. ఈ రెండు సంస్థలకు మహేశ్ బాబు ప్రమోషన్ నిర్వహించారు. ఇందుకోసం రూ. 5.9 కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్నారు. ఇందులో కొంత నగదు రూపంలో తీసుకోగా.. మరికొంత ఆర్‌టీజీఎస్ రూపంలో ట్రాన్స్‌ఫర్ అయింది. అయితే ఈ డబ్బులకు సంబంధించిన లావాదేవీలు సాయి సూర్య డెవలపర్స్, సురానా కంపెనీలో ఈడీ తనిఖీలు నిర్వహించినప్పుడు అవకతవకలు జరిగినట్టు బయటపడింది. సోదాల్లో దొరికిన డాక్యుమెంట్స్ ఆధారంగా మహేశ్ బాబుకి ఈడీ నోటీసులు ఇచ్చింది.

## ఏఐ చిత్రాలకూ ఆస్కార్

**2026 అవార్డ్స్ వేడుకల డేట్ ఫిక్స్**

ఫిల్మ్‌ఇండస్ట్రీ ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల వేడుక వివరాలు తాజాగా అకాడమీ పేర్కొంది. లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో 98వ ఆస్కార్ అవార్డ్స్ వేడుకలను 2026లో మార్చి 15న నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈపురస్కారాల కోసం పోటీ పడనున్న మూవీల లిస్టును 2026 జనవరి 22న ప్రకటించనున్నట్లు అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ వెల్లడించింది. ఈసారి కొన్ని కొత్త రూల్స్ ప్రవేశ పెట్టింది. ఎలిజిబిలిటీ గైడ్ లైన్స్, నామినేషన్స్, ఓటింగ్‌లో నిబంధనలు సవరించినట్లు పేర్కొంది. ఇక నుంచి ఓట్ వేయాలంటే నామినేట్ అయిన సినిమాను అకాడమీ సభ్యులు కచ్చితంగా వీక్షించాలని చెప్పింది. ఫైనల్ ఓటింగ్ ముందు కాస్టింగ్ డైరెక్టర్లకు కొన్ని రౌండ్ల టెస్టింగ్ ఉంటుందని వెల్లడించింది. చిత్ర పరిశ్రమలో పెరుగుతోన్న



టెక్నాలజీని దృష్టిలోపెట్టుకున్న అకాడమీ.. ఈసారి ఏఐ వాడిన చిత్రాలను అనుమతించనున్నారు. ఇది ఇతర చిత్రాలపై ప్రభావం చూపదని పేర్కొంది. అయితే హ్యూమన్ క్రియేటివిటీకే ప్రాధాన్య మిస్తామని తెలిపారు.



# పెళ్లి రోజే గుడ్ న్యూస్

**తల్లిదండ్రులైన నటుడు విష్ణు విశాల్, జ్వాలా గుత్తా**

తమిళ నటుడు విష్ణు విశాల్, బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ జ్వాలా గుత్తా దంపతులు తమ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు. తాము తల్లిదండ్రులైనట్లు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. గుత్తా జ్వాలా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు విష్ణు విశాల్ ట్విట్టర్‌లో పోస్టు పెట్టాడు. 'మాకు ఒక ఆడపిల్ల పుట్టింది. ఆర్యన్ ఇప్పుడు అన్నయ్య అయ్యాడు. ఇవాళ మా 4వ వివాహ వార్షికోత్సవం. అదే రోజున మేము ఆ భగవంతుడి నుంచి ఈ గిఫ్ట్ అందుకోవడం సంతోషంగా ఉంది. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలు ఎప్పటికీ మాతో ఉండాలి' అంటూ రెండు ఫొటోలు పోస్ట్ చేశారు. ఇది చూసిన అభిమానులు, నెటిజన్లు, గుత్తా జ్వాలా విష్ణు విశాల్ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. విష్ణు విశాల్ చివరిసారిగా దర్శకురాలు ఐశ్వర్య రజనీకాంత్ నటించిన 'లాల్ సలామ్' చిత్రంలో కనిపించాడు. ప్రస్తుతం అతను ఇరండు వానం, మోహన్దాస్, ఆర్యన్ చిత్రాలలో నటిస్తున్నాడు.



**పింక్ రంగులో త్రిష కృష్ణన్ క్లాసీ లుక్**
త్రిష కృష్ణన్ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో స్టైలిష్ పింక్ డ్రెస్ ధరించి ఉన్న అద్భుతమైన ఫోటోను షేర్ చేసింది.



**నటీమణులు తరచుగా సాంప్రదాయ సౌందర్యం మరియు ఆకర్షణీయమైన శైలి మధ్య ఎంచుకునే ప్రపంచంలో, కీర్తి సురేశ్ రెండింటినీ అప్రయత్నంగా స్వీకరిస్తుంది. ఆమె ఫ్యాషన్ సెన్స్ అనేది కాలాతీత గాంభీర్యం మరియు సమకాలీన శైలి యొక్క సామరస్య సమ్మేళనం - ఈ విధానం దేశవ్యాప్తంగా అభిమానులను ఆకర్షిస్తూనే ఉంది.** ”

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD.
PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net
Mobile No. 98660 19778, 89789 60131.